పరిష్కారం

రాణీ శివశంకర శర్మ

రాఘవ కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. పద్మాల్లా ఉన్నాయనడానికి అతడు కావ్యనాయకుడు కాదు. నిరుద్యోగి.

ఇంటర్వ్యూకి నడుచుకుంటూ పోతున్నాడు. చచ్చిన ఉత్సాహాన్ని బ్రతికించుకొనడానికి ప్రయత్నిస్తూ. సినిమాహాలుదగ్గర ఆగాడు.

కుక్కల్లా కొట్టుకొనే మనుషులు. ఒకళ్ళమీద ఒకళ్ళు పడుతో తోసుకుంటూ, చెమటకంపును భరిస్తూ, అడ్డమైన చావులు చస్తూ, సినిమా టికెట్లకోసం.

ఆ సన్నివేశం రాఘవకు మూర్తీభవించిన పశుత్వంలా కనిపించింది.

మనిషికి మంచితనమనేది స్వభావంకాదు. ఆఫ్టరాల్ సినిమా టికెట్టుకోసమే తన నిజస్వభావం వెలిబుచ్చుకొంటున్న మనిషి వొక్క నిముషమైనా నిస్వార్థంగా ప్రవర్తిస్తాడనడంలో నమ్మకంలేదు.

ఇంటర్వ్యూకి వచ్చినవాడెంత మిత్రుడైనా, ఆప్తుడైనా, తన కుద్యోగం వస్తే చాలనుకొంటాడు. లంచమిచ్చైనా సంపాదించడానికి ప్రయత్నిస్తాడు. తనకంటె ముందు మిత్రుడి విషయం ఆలోచిస్తాడా! పుస్తకాల్లోను, సినిమాల్లోను. తప్ప.

ఏమిటి సినిమా? అని చూసాడు. "న్యాయం కావాలి"

ఇదివరలో చూసా డీ సినిమా. స్త్రీ విషయంలో చాలా బాగా న్యాయం చెప్పా డన్నారందరూ. తన కొక సంఘటన గుర్తుకు వస్తోంది.

తను ప్రేమించిన సుధను పెళ్ళి చేసుకొనగలిగాడా? ఆమెతో సుఖించాడు కూడ. ఒకరోజున తనకు సంబంధాలు వస్తున్నాయని, పెళ్ళి విషయం ఆలోచించమని, అంది సుధ. "ఉద్యోగం లేదెలా? ఇప్పుడప్పుడే వచ్చే సూచనలు కూడ లేవు" అన్నాడు తను. రెచ్చిపోయిందామె. "ఎందుకు కళ్ళు మూసుకొనిపోయి ప్రవర్తించావు. ఛీ వెధవ బుద్ధులు. మీ మగ వాళ్ళందరూ ఇంతే. ఏమాత్రం న్యాయం లేదు" అని సినిమా డైలాగులు పేల్చిపోయింది.

హూ. న్యాయం. తనకొకటి జరుగలేదు. మరొకరికేం చేకూరు స్తాడు తను. తనకే గడపడం కష్టమైనప్పుడు మరొకర్నేం భరిస్తాడు? కళ్ళు మూసి దోబూచులాడేది వేరేగా వుంది. అది వయస్సు. తనకు కూడ చీము, నెత్తురు, అన్నీ వున్నాయి. లేనిదల్లా ఉద్యోగమే.

సిటీబస్సు వస్తే పరిగెత్తుకెళ్ళాడు.

బస్సు బయలుదేరబోతోంది. గెంటుకొంటూ క్రిక్కిరిసి ఎక్కుతు న్నారు జనం. ఒక చిన్నపిల్ల నలిగిపోయి ఏడుస్తోంది. "బాబూ! పిల్ల నలిగిపోతోంది" అని దీనంగా అర్థిస్తోంది తల్లి. వినే వాళ్ళెవరూ లేరు. పిల్ల యేడుస్తోనే వుంది. గమ్యానికి జేరుకోవడానికి వారి తొందర. "పిల్ల ఏడుస్తూంటే, ఎందుకలా ఎగబడతారు. మంచి, చెడు, లేదా?" అని ప్రశ్నిస్తే "నీ మంచి చెడుల మాట అలా వుంచవయ్యా. నా పెళ్ళానికి మందులు పట్టుకొని వెళ్ళాల"ని ఒకరు, "పిల్ల లేడుస్తూంటారు. ఇంటికి బియ్యం పట్టుకొని వెళ్ళాల"ని ఒకరు, ఇలా ఒకొక్కరు ఒకొక్క కారణం చూపిస్తారు.

"మీరు బాధపడితే బాధపడండి. ఎదుటివారిని మాత్రం బాధపెట్ట కండం"టే "నోర్మూయ్యండ"నేది సమాధానం. వాళ్ళది మాత్రం తప్పే ముంది? వాళ్ళపనులకన్న, వాళ్ళ బాధ్యతలకన్న, యెదుటివారి వెందుకు

ముఖ్యం కావాలి? ఎందుకవుతాయి, ఎన్నో స్వార్థపరాలైన జంతువులకు వలె రక్తమాంసాలతోనే నిండివున్న మనుషులకి.

ఈ ఆలోచనలతో బస్సు దాటపెట్టాడు. ఇంకొంచెం ముందుకు వెళ్ళాడు.

ఎవరో శాస్త్రిగారు ధర్మాన్ని గురించి ఉపన్యాసం దంచేస్తున్నారు. సామాన్యవిషయాల్లోనే పశువుల్లా ప్రవర్తించే మనుషులు, ఉపన్యాసం చెప్పమంటే బిల్ల గ్రుద్దుతూ ఏమాత్రం సంకోచం లేకుండా అంతా సమన్వయం కుదిరినట్లే చెపుతారు. వారా ధర్మాన్ని ఆచరించలేరు. ఎదుటివారు ఆచరిస్తారనే నమ్మకం అసలు లేదు. ఐనా యీ ధర్మాలను గురించి, న్యాయాలను గురించి, జీవితాలను గురించి, సమన్వయాలు, ఉపన్యాసాలు, తీరిక వున్నవాళ్ళకి. ప్లాటుఫారాలమీద వుండే వాళ్ళకి, ఎప్పుడూ పని చేస్తే కాని రోజు గడవని వాళ్ళకి, తనబోటి వుద్యోగాన్వేషకులకి, ధర్మాలు లేవు. రసాలూ లేవు. ఉన్నవల్లా అవసరాలు.

ప్రేమ, ధర్మం, న్యాయం, వివేకం, ఆనందం, సౌందర్యం, ఇలాంటి చిలకపలుకులు నేర్చుకొనడానికి తీరుబడి, అవకాశం, ఉండాలి.

తనకు డిగ్రీ వుంది. ఉద్యోగం లేదు. తండ్రి రిటైరైనాడు. తనకు కావలసినది జాబు. ఆ జాబీ శాస్త్రుర్లిస్తాడా? భావకవిత్వం రాస్తానంటే కృష్ణశాస్త్రుర్లిస్తాడా? ఎవరు, ఎవరిస్తారు?

ఎన్ని అందమైన కబుర్లు? ప్రేమను గురించి ఎన్ని అందమైన రాతలు? నీతిని గురించి ఎంత అందమైన కోతలు? చూస్తే వట్టి రోతలు. అన్నీ అవకాశవాదాలు. మాటలు మాత్రమే కోటలు దాటుతాయి.

ఎందుకింత అందమైన మోసం? ఎందుకీ సాహిత్యం? ఉద్యోగం కావాలి. ఎవరిస్తారు? ఈ యిరవయ్యో శతాబ్దంలో, ప్రయత్నానికి, ఫలి

తానికి, సంబంధాలు తెగిపోయాయి. చదువుకొన్నవానికి ఉద్యోగం వస్తుందో, లేదో, నమ్మకం లేదు. ప్రేమ కవిత్వం వ్రాసే వానిని ఎవతె యైనా కనికరిస్తుందనే నమ్మకం లేదు. ప్రేమ పెళ్ళిని జేరుస్తుందో, లేదో, నమ్మకం లేదు. ప్రయాణం గమ్యాన్ని చేరుస్తుందో, లేదో, నమ్మకంలేదు.

ఏమాత్రం సమన్వయం కుదరక ఏదో ఒక దిక్కుకి దిక్కులేని గాలిపటంలా కొట్టుకొనిపోతూ, జీవితాన్ని కొనసాగించడంలో అర్థంలేదు, ప్రయోజనమూ లేదు. "ప్రయోజన మనుద్దిశ్య, నమందోపిప్రవ ర్తతే". ఏ సౌందర్యము, ఏ ఆనందము, ఏవొడ్డూ దొరకని జీవితాన్ని కొనసాగించడంలో సరియైన హేతువులేదు. బ్రతకడంలో అర్థం లేన ప్పుడు చావడంలో తప్పులేదు. చస్తే నరకమా? బ్రతికున్నా నరకమే. ఐనా మనం చేసే పనుల కెన్నిటికో ఫలితం దక్కటంలేదు. చస్తే మాత్రం దానికీ ఫలితం ఉంటుందనేమిటి? అంతా శుద్ధ అబద్ధం. సర్వ సమస్యలకు చావే పరిష్కారం.

సర్టిఫికెట్‌ను విసిరివేసి, బ్రిడ్జివైపు నడుస్తున్నాడు రాఘవ, అర్థం కనిపించని జీవితాన్ని విసిరిపారవెయ్యడానికి.

❋ ❋ ❋